
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
శుక్రవారం 7 జూన్ 2024



8లో.. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య
8లో.. పిడుగుపాటుకు గొర్రెల కాపరికి తీవ్రగాయాలు

- ముగిసిన కౌంటింగ్
- బీఆర్ఎస్ ప్యానెల్ అభ్యర్థులదే హవా
- ఎనిమిది మంది డైరెక్టర్ల గెలుపు
- కాంగ్రెస్, బీజేపీ మద్దతుదారుల్లో ఒక్కొక్కరు విజయం
- స్వతంత్రులుగా మరో ఇద్దరు
- క్యాంపునకు తరలిన డైరెక్టర్లు
- డైరెక్టర్ల కిడ్నాప్ యత్నం.. చెదరగొట్టిన పోలీసులు
- 6,177 ఓట్లకు 4,760 ఓట్లు పోల్
- నేడు చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక



పోలింగ్ కేంద్రం వద్ద పోలీసులతో మద్దతుదారుల వాగ్వాదం

ఉత్సాహంగా అర్బన్ బ్యాంక్ పోలింగ్

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

సిరిసిల్ల సహకార అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో ప్రధాన ఘట్టం ముగిసిం ది. గురువారం ఎంతో సందడిగా ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం 2.45 గంటల వరకు పోలింగ్ జరిగింది. అనంతరం ఎంతో ఉత్కంఠతగా కౌంటింగ్ ప్రక్రియ కొనసాగింది. 12 డివిజన్లలో 61 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. నువ్వా నేనా అన్నట్లుగా ఓటర్లను తమవైపు తిప్పుకోవడానికి ముమ్మర ప్రయత్నం చేశారు. పోలింగ్ సమయంలో కూడా ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తూ ఓటింగ్ పూర్తయ్యే వరకు కేంద్రాల వద్ద అభ్యర్థుల మద్దతుదారులు సందడి చేశారు.

కౌంటింగ్ పూర్తయి క్యాంపునకు తరలివెళ్లే క్రమంలో డైరెక్టర్లను కిడ్నాప్ చేసే యత్నం చోటుచేసుకుంది. దీంతో పోలీసులు లాఠీలు ఝళిపించి చెదరగొట్టడంతో ఉద్రిక్తతకు దారి తీసింది. పోలీసులు చెదరగొట్టడంతో పలువురికి స్వల్పంగా దెబ్బలు తగలడంతో పోలీసులతో వాగ్వాదానికి దిగారు. అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ నాగేంద్రచారి, సీఐలు వివిధ పార్టీల కార్యకర్త లను సముదాయించడంతో వివాదం సద్దుమణిగింది. కౌంటింగ్ సమ యంలో నాలుగో వార్డుకు సంబంధించి అడ్డగట్ల మురళికి 190 ఓట్లు, సూరం వినయ్‌కు 186 ఓట్లు వచ్చాయి. నాలుగు ఓట్లు తేడా ఉండడంతో వినయ్ రీకౌంటింగ్ కోరారు. ఆలస్యంగా రీకౌంటింగ్ కోరారనే దానిపై బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు, సహకార అధికారులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. చివరకు రీకౌంటింగ్‌కు ఆమోదించారు. ఒకవైపు రీకౌంటింగ్‌పై ఎన్నికల అధికారి ముందు వాగ్వాదం జరుగుతుండగానే ఫిర్యాదు చేసిన అభ్యర్థి రీకౌంటింగ్‌లో ఓట్లు సరిచూసుకొని సరిగ్గా ఉన్నాయని తెలపడం గమనార్హం. దీంతో అడ్డగట్ల మురళి గెలుపొందినట్లుగా ప్రకటించారు.

డివిజన్	గెలిచిన అభ్యర్థి	ఓట్లు	ప్రత్యర్థి	ఓట్లు
1వ	రాపెల్లి లక్ష్మీనారాయణ	137	నల్ల ప్రదీప్	117
2వ	గుడ్ల సత్యానందం	170	భోగ శంకర్	146
3వ	చొప్పదండి ప్రమోద్	203	బొద్దుల భాస్కర్	154
4వ	అడ్డగట్ల మురళి	190	సూరం వినయ్	186
5వ	పాటి కుమార్ రాజు	188	తుంగ శివరాజ్	150
6వ	బుర్ర రాజు	218	మ్యాన రాంప్రసాద్	183
7వ	వేముల సుక్కమ్మ	334	ప్రయాకర్‌రావు వినీల	30
8వ	అడ్డగట్ల దేవదాస్	205	గోరంట్యాల ప్రకాష్	97
9వ	ఎనగందుల శంకర్	251	నేరేళ్ల ప్రేమ్‌కుమార్	162
10వ	వరుల హరిణీ	151	చీటి గీత	136
11వ	పత్తిపాక సురేస్	204	ఎర్రగుంట కపిల్	136
12వ	కోడం సంజీవ్	291	అడెపు సూర్య	172

బీఆర్ఎస్ ప్యానెల్‌దే హవా...

సిరిసిల్ల సహకార అర్బన్ బ్యాంక్ పాలకవర్గంలో మరోసారి పాగా వేయడానికి బీఆర్ఎస్ ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని అభ్యర్థులకు మద్దతు పలికింది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ఫొటోలతో ప్రచారం నిర్వహించారు. అర్బన్ బ్యాంక్ పరిధిలో 12 డివిజన్లలో బీఆర్ఎస్ మద్దతు పలికిన అభ్యర్థుల్లో ఎనిమిది మంది గెలుపొందారు. వీరితో పాటు పాటు స్వతంత్రులుగా గెలిచిన వారు కూడా వీరికి మద్దతుగానే ఉన్నట్లుగా తెలిసింది. బీఆర్ఎస్ మద్దతు దారుల్లో రాపెల్లి లక్ష్మీనారాయణ, అడ్డగట్ల మురళి, పాటి కుమార్‌రాజు, బుర్ర రాజు, వేముల సుక్కమ్మ, అడ్డగట్ల దేవదాస్, ఎనగందుల శంకర్, కోడం సంజీవ్‌లు గెలుపొందారు. బీజేపీ మద్దతుదారుడిగా పత్తిపాక సురేష్, కాంగ్రెస్ మద్ధతుదారుడుగా చొప్పదండి ప్రమోద్ గెలుపొందారు. స్వతంత్రులుగా గుడ్ల సత్యానందం, వరుస హరిణి గెలుపొందినప్పటికీ బీఆర్ఎస్ గూటికే చేరారు. గెలుపొందిన వారిని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళచక్రపాణి, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట అగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, టెక్స్‌టైల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ గాజుల నారాయణ, పలువురు బీఆర్ఎస్ నాయకులు అభినందనలు తెలిపారు.

వీరు ఒక్క ఓటుకు నోచుకోలేదు..

సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ ఎన్నికల ఫలితాల్లో ఎవరికి ఎన్ని ఓట్లు వచ్చాయనే ఆసక్తితో ఓటర్లు లెక్కలు వేస్తున్నారు. 12 డివిజన్లలో 61 మంది పోటీ పడగా అత్యధిక ఓట్లు వేముల సుక్కమ్మ 334 ఓట్లతో గెలుపొందారు. కొందరికి ఓట్లు రాక పోవడం, ఒక్క ఓటు వచ్చిన వారు ఉన్నారు. 1వ డివిజన్‌లో అరుకాల ఆనందం, గుడ్ల వెంకటేశం, పత్తి పాక పద్మ, బొల్లి రవీందర్‌కు ఒక్క ఓటు చొప్పున రాగా, బుర్ర వెంక టేశం ఒక్క ఓటు కూడా రాలేదు. ఆరో డివజన్‌లో కంది కట్ల సదా నందం, మర్రిపల్లి శశికాంత్, వంగరి అంబదాస్‌కు ఒక్కొక్క ఓటు వచ్చాయి. ఎనిమిదో వార్డులో అవధూత నాగరాజు, రాపెల్లి శ్రీహరికి రెండు ఓట్ల చొప్పున తొమ్మిదో డివిజన్‌లో అడెపు జగదీశ్వర్, సోమి శెట్టి దశరథంకు మూడు ఓట్లు, 10వ డివిజన్‌లో అడెపు అనసూర్యకు, 11వ డివిజన్‌లో ఉలిసె శ్రీనివాస్, కొండి సదానందం, 12వ డివిజన్‌లో అడిగొప్పుల పరమేష్, మామిడాల రమణకు ఒక్క ఓటు లభించలేదు. ఇదే డివిజన్‌లో బూర్ల విద్యాసాగర్‌కు ఒక్క ఓటు లభించాయి.

పోలైన ఓట్లు 4,760..

సిరిసిల్ల అర్బన్ బ్యాంక్‌లోని 12 డివిజన్లలో 6,177 మంది ఓటర్లు ఉండగా 4,760 ఓట్లు పోలయ్యాయి. 77 శాతం పోలింగ్ జరిగింది. 1వ డివిజన్ నుంచి 11 డివిజన్ వరకు 514 ఓట్లు, 12వ డివిజన్‌లో 523 ఓట్లు ఉన్నాయి. వీటిలో ఒకటో డివిజన్‌లో 289 ఓట్లు , రెండో డివిజన్‌లో 327 ఓట్లు, మూడో డివిజన్‌లో 363 ఓట్లు, నాలుగో డివిజన్‌లో 386 ఓట్లు, ఐదో డివిజన్‌లో 351 ఓట్లు, ఆరో డివిజన్‌లో 410 ఓట్లు, ఏడో డివిజన్‌లో 378 ఓట్లు, ఎనిమిదో డివిజన్‌లో 395 ఓట్లు, తొమ్మిదో డివిజన్‌లో 440 ఓట్లు, పదో డివిజన్‌లో 457 ఓట్లు, 11 వ డివిజన్‌లో 477 ఓట్లు, 12వ డివిజన్‌లో 487 ఓట్లు పోలయ్యాయి.

నేడు చైర్మన్ ఎన్నిక..

సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో ప్రధాన ఘట్టమైన డైరెక్టర్ల ఎంపిక పూర్తి కావడంతో శుక్రవారం ఉదయం 8.30 గంటలకు ఎన్నికైన డైరెక్టర్లతో సమావేశం నిర్వహించి, చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలను నోటిఫికేషన్ జారీ చేసి ఎన్నికల పక్రియను పూర్తి చేయనున్నారు. ఇందుకు సంబంధించి ఎన్నికల అధికారి రామకృష్ణ, డైరెక్టర్లకు సమావేశానికి రావాలని నోటీసులు జారీ చేశారు. ఎన్నికల పక్రియను జిల్లా సహకార అధికారి బుద్ధనాయుడు పర్యవేక్షించారు.

చైర్మన్ రేసులో రాపెల్లి లక్ష్మీనారాయణ

సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో బీఆర్ఎస్ మద్దతుదారులు మెజార్టీ డైరెక్టర్లుగా గెలవడంతో చైర్మన్ రేసులో రాపెల్లి లక్ష్మీనారాయణ ఉన్నారు. వైస్ చైర్మన్ స్థానానికి మాత్రం పోటీ ఏర్పడింది. మహిళకు అవకాశం ఇవ్వాలనే వాదన ముందుకు వచ్చింది. వైస్ చైర్మన్ కోసం వేముల సుక్కమ్మ, అడ్డగట్ల మురళి, కోడం సంజీవ్‌తో పాటు ఎస్సీ సామాజిక వర్గానికి చెంది వ్యక్తికి అవకాశం ఇవ్వాలనే కోణంలో పాటి కుమార్ రాజు కూడా రేసులో ఉన్నారు.





గెలుపొందిన డైరెక్టర్లు, డైరెక్టర్లను అభినందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, బీఆర్ఎస్ నాయకులు

పారిశుధ్య పనులపై దృష్టి సారించాలి

- జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ



మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ

సిరిసిల్ల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం సీజన్ మొదలైన దృష్ట్యా గ్రామాల్లో పారిశుధ్య పనులపై దృష్టి పెట్టాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దృష్టి సారించాలని జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అన్నారు. గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు చేయడంతో పాటు ఎటువంటి లీకేజీలు లేకుండా మిషన్‌భగీరథ నీటిని సరఫరా చేయాలన్నారు. బడిబాట కార్యక్రమంలో బడీడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలని అన్నారు. పాఠశాలల్లో పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని అన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో ఉమారాణి, డీఆర్‌డీవో శేషాద్రి, డీఈవో రమేష్, డిప్యూటీ సీఈవో గీత పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతం

ఇల్లంతకుంట, జూన్ 6: మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన మెగా వైద్యశిబిరం విజయవంతం అయ్యింది. మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ జన్మదినాన్ని పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం రాఘవేంద్ర ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. బస్టాండ్ ప్రాంతంలో జరిగిన వైద్యశిబిరంలో 379మందికి వైద్యపరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భూంపెల్లి రాఘవరెడ్డి, నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అంతగిరి వినయ్‌కుమార్, ఆసుపత్రి నిర్వాహకులు వెంకటేశ్వర్‌రావు, భవాణి, నాయకులు బాలపోచయ్య, కర్ణాకర్‌రెడ్డి, లింగం, సురేందర్‌రెడ్డి, యాస తిరుపతి, ఎర్రోజు సంతోష్‌కుమార్, బెజ్జంకి శ్రీనివాస్, మల్లేశం, జమాల్, యశ్వంత్, సాయివర్మ, వీరేశం, రమేష్, విజయ్, చింటు, కేశవులు, మల్లేశం పాల్గొన్నారు.

బీసీజీ వ్యాక్సిన్‌పై అపోహలు వద్దు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

సిరిసిల్ల టౌన్, జూన్ 6: వ్యాక్సిన్‌పై ప్రజలు అపోహలు పడవద్దని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుమన్ మోహన్‌రావు అన్నారు. గురువారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సూపర్ వైజర్లకు బాసిల్ కాల్మెట్-గ్యురిన్(బీసీజీ)టీకాపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుమన్ మోహన్‌రావు మాట్లాడుతూ బీసీజీ వ్యాక్సినేషన్ అందించేందుకు వీలుగా అవసరమైన కార్యాచరణ చురుకుగా సాగుతోందన్నారు. శిక్షణ తరువాత ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాయిలో శిక్షణ కార్యక్రమాలను కూడా నిర్వహిస్తామన్నారు. బీసీజీ వ్యాక్సిన్ సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాగా చిన్న పిల్లలకు, పెద్దవారికి అడల్ట్‌డోస్ ఇస్తారని అన్నారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు, వెల్నెస్ కేంద్రాల్లో వ్యాక్సిన్ ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎవరెవరికి వ్యాక్సిన్ ఇవ్వాలనేది ముందుగా ఇంటింటి సర్వే ద్వారా గుర్తిస్తామన్నారు. అనంతరం క్షయ వ్యాధి నివారణలో వ్యాక్సిన్ పనితీరును వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వోలు డాక్టర్లు రజిత, నాయిమ్‌జాన్, టీ రాజ్‌కుమార్, హెచ్‌ఈ బాలయ్య, హెచ్‌ఈవో లింగం డీపీపీఎం బిగంధర్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

మురుగునీరు పోయేదెలా?



మురుగుకాలువలో వేసిన రాళ్లు, మట్టి

ముస్తాబాద్, జూన్ 6: మండలంలోని గూడెం గ్రామంలో గల బస్టాండ్ ఆవరణలో డ్రైనేజీ నిర్మాణం బాగానే ఉన్న అటు వైపు ఉన్న పాఠశాల, ఆరోగ్య కేంద్రం, బీసీ కాలనీకి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మోరిపై నుంచి దాటాలంటే మహిళలు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్రవాహనాలు అటు వైపు వెళ్లే పరిస్థితి లేదు. మోరీలో రాళ్ల వేయడం వల్ల మురుగు నీరు నిలిచి దోమలు పేరుకుపోయి జ్వరాలు ప్రబలుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చే గర్భిణులు చాలా ఇబ్బంది పడుతున్నారు. డ్రైనేజీ కాలువపై కప్పు వేసేలా చూడాలని జిల్లా అధికారులను ప్రజలు కోరుతున్నారు.

ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలి

- మిషన్‌భగీరథ నీటి సరఫరాపై నివేదిక రూపొందించాలి - గ్రూప్ 1 పరీక్ష నిర్వహణ పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

సిరిసిల్ల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వానాకాలం పంట సీజన్ ప్రారంభం అవు తుందని రైతులకు అవసరమైన అన్ని రకాల విత్తనాలు, ఎరువులు, రాష్ట్రంలో ప్రతి జిల్లాలో సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని వాటి పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సూచించారు. గురువారం హైదరాబాద్ నుంచి వానాకాలం పంట సీజన్ విత్తనాలు, ఎరువుల లభ్యత మిషన్‌భగీరథ, స్కూల్ యూనిఫాంలు, గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహణపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్లు పూజారి గౌతమి, ఖీమ్యానాయక్ పాల్గొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 4,699 మంది అభ్యర్థులు గ్రూప్-1 పరీక్ష రాయడం కోసం 15 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని ప్రత్యేకంగా కంట్రోల్‌రూం ఏర్పాటు చేశామని వివరించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ జూన్ 9న జరిగే గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షలను నిబంధనల ప్రకారం పక్కాగా నిర్వహించాలని అన్నారు. పరీక్ష కేంద్రానికి ప్రశ్నాపత్రాలు తరలించడం, తిరిగి స్ట్రాంగ్‌రూంనకు తీసుకరావ డంలో అప్రమత్తంగ వ్యవహరించాలని సూచించారు. వానాకాలం సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని, నకిలీ విత్తనా లు అరికట్టాలని అన్నారు. డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేసే విధంగా అవగాహన కల్పించాలని అన్నారు. పత్తి విత్తనాలను అవసరం మేరకు అందుబాటులో ఉంచాలని అన్నారు. నకిలీ విత్తనాలపై పీడీయాక్ట్ కేసులు పెట్టాలన్నారు. వేసవి కాలంలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా అధికారులు సఫలీకృతం అయ్యారని అన్నారు. నిరంతరం తాగునీరు సరఫరా చేయాలని మిషన్‌భగీరథ నీటి సరఫరాపై నివేదికలు ఇవ్వాలన్నారు. ప్లాస్టిక్ ప్రత్యామ్నా యంగా బట్ట సంచుల వినియోగాన్ని ప్రోత్సహించాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో గ్రూప్-1 పరీక్షలకు సంబంధించి పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మహేందర్‌రెడ్డి పలు సూచనలు చేశారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు

గ్రూప్-1 ప్రిలిమ్స్‌ను పకడ్బందీగా నిర్వహించాలి

- పరీక్ష కేంద్రాలకు ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించవద్దు - వీడియో కాన్ఫరెన్స్‌లో టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి

సిరిసిల్ల కలెక్టరేట్, జూన్ 6: గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలను ఈ నెల 9న పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయడంతోపాటు పరీక్ష కేంద్రాలకు ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించవద్దని అలాగే అభ్యర్థులు ఒక రోజు ముందుగానే పరీక్ష కేంద్రాలను సందర్శించాలని తెలంగాణ పబ్లిక్ కమిషన్ చైర్మన్ మహేందర్‌రెడ్డి అదేశించారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో గురువారం జరిగిన వీడియోకాన్ఫరేన్స్‌లో హైదరాబాద్‌నుంచి టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ పూజారి గౌతమితోపాటు సంబంధిత అధికారులతో మాట్లాడి ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఆదివారం ఉదయం 10 గంటలనుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్‌తోపాటు గట్టి బందోబస్తును ఏర్పాటుచేయాలన్నారు. టీజీపీఎస్సీ నుంచి వచ్చే పరీక్ష పత్రాలు, ఓఎంఆర్ షీట్లును జాగ్రత్తగా భద్రపర్చాలని, కేంద్రం వద్ద సీసీ కెమారాలను ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష విధులు నిర్వర్తించే అబ్జర్వర్, రూట్ అఫీసర్స్ ఫ్లయింగ్ స్క్వాడ్ , ఇన్విజిలేటర్లు ఇతర సిబ్బందికి శిక్షణ ఇవ్వాలన్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలో మహిళలు, పురుషులకు వేరువేరుగా తనిఖీలను నిర్వహించేందుకు గదులను ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేయడంతోపాటు పరిసర ప్రాంతాల్లో జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్టీసీ అధికారులు అభ్యర్థులకు అనుగుణంగా బస్సులను నడిపించాలని, సెస్ అధికారులు విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలన్నారు. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పరీక్షలకు ఏర్పాట్లు చేయాలని సూచించారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్ పి గౌతమి

జిల్లాలో 15 పరీక్ష కేంద్రాలు

జిల్లాలో 15 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా ఇందులో 4,699 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. అభ్యర్థులకు అనుగుణంగా పరీక్షలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా అదనపు కలెక్టర్ పూజారి గౌతమి తెలిపారు. ప్రిలిమినరీ పరీక్షలకు సంబంధించి ఏమైనా సమస్యలుంటే జిల్లా స్థాయిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం 9398684240 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు. అదేవిధంగా ప్రతి పరీక్షా కేంద్రంవద్ద తాగునీరుతోపాటు మరుగుదొడ్లను సక్రమంగా ఉండేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు.

ముందుగానే పరీక్షకేంద్రాలకు చేరుకోవాలి

గ్రూప్ -1 పరీక్షలను రాసే అభ్యర్థులు ఒక రోజు ముందుగానే పరీక్ష కేంద్రాలను చూసుకోవాలని కోరారు. పరీక్ష జరిగే రోజు ఉదయం 9గంటల వరకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. పదిగంటల తరువాత పరీక్ష కేంద్రాల్లోకి అనుమతులు ఉండదని స్పష్టం చేశారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ చంద్రయ్య, ఆర్డీవో డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్, పర్యవేక్షకులు వేణు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

తిమ్మాపూర్, జూన్6: మండలంలోని మోయతుమ్మెద వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను రేణికుంట గ్రామం వద్ద పట్టుకొని పోలీస్ స్టేషన్ తరలించినట్లు ఎల్ఎండీ ఎస్సై చేరాలు తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఒకరి అదృశ్యం

మానకొండూర్, జూన్ 6: మండలంలోని ముంజంపల్లి గ్రామానికి చెందిన యాళ్ళ శ్యాంసుందర్‌రెడ్డి ((44) అనే కారు డ్రైవర్ అదృశ్యం అయినట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. ముంజంపల్లికి చెందిన శ్యాంసుందర్‌రెడ్డి కారు డ్రైవర్‌గా పని చేస్తు ఆన్‌లైన్ ఆటలు ఆడుతుండేవాడని, దీంతో భార్య జమున మందలించిందని తెలిపారు. దీంతో ఈ నెల 1నుంచి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడని తెలిపారు. అప్పటి నుంచి భర్త ఆచూకీ లేదని గురువారం భార్య ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

- రూ. 6లక్షల నగదు, మూడు వాహనాలు స్వాధీనం

మెట్‌పల్లి, జూన్, 6 : మెట్‌పల్లి, కోరుట్ల డివిజన్ గ్రామాల్లో ద్విచక్ర వాహనాలు దొంగతనం చేసి విక్రయించి సొమ్ము చేసుకుంటున్న దొంగను అరెస్టు చేసి, రూ. 6లక్షల నగదు, మూడు వాహనా లను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు తెలిపారు. గురువారం మెట్‌పల్లి డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ నవీన్, ఎస్సై చిరంజీవిలతో కలిసి ఆయన వివరాలను వెల్లడించారు. మెట్‌పల్లి మండలంలోని సత్తక్కపల్లి గ్రామానికి చెందిన షేక్ ఇస్మాయిల్ ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఆటో నడపడం ద్వారా వచ్చే డబ్బులు కుటుంబ పోషణకు, మద్యానికి, జల్సాలకు సరిపోక సులువుగా డబ్బు సంపాదించాలని దొంగతనాలకు పాల్పడుతున్నాడు. ఇందులో భాగంగా మెట్‌పల్లి, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, కోరుట్ల మండలాల పరిధిలోని గ్రామాల్లో గత కొంత కాలం నుంచి హండిల్ లాక్ వేయని ద్విచక్ర వాహనాలను దొంగతనానికి పాల్పడుతు న్నాడు. దొంగి లించిన వాహనాలను నిజామాబాద్, ఆర్మూర్, పెర్కిట్, మోర్తాడ్, కమ్మర్‌పల్లి, కోరుట్ల, జగిత్యాల, గంగాధర పరిధి లోని గ్రామాల్లోని వారికి తక్కువ ధరకు విక్రయించేవాడు. వచ్చిన డబ్బులతో జల్సాలకు పాల్పడుతున్నాడు. జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు డీఎస్పీ పర్యవేక్షణలో మెట్‌పల్లి సీఐ, ఎస్సైలు సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పాడి గాలింపు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా గురువారం మెట్‌పల్లి పాతబస్టాండ్ సమీపంలో ఎస్సై తన సిబ్బంతో కలిసి వాహనాల తనిఖీలు చేపట్టారు. అదే సమయంలో షేక్ ఇస్మాయిల్ అనుమానాస్పదంగా తిరుగుతుండగా అదుపులోకి తీసుకొని విచారించగా వాహనాలు దొంగిలించినట్లు ఒప్పుకున్నాడు.



మాట్లాడుతున్న డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు

నిందితుడు దొంగిలించిన వాహనాలను స్క్రాప్‌గా చేసి విక్రయించగా వచ్చిన రూ.6ల క్షల నగదు, మూడు వాహనాలను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. దొంగ వాహనాలను కొనుగోలు చేసిన 16మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దొంగను పట్టుకున్న సీఐ నవీన్, ఎస్సై చిరంజీవి, ఏఎస్సై బేగ్, అంజనేయులు, హెడ్‌కానిస్టేబుల్ అశోక్, సిబ్బంది కిరణ్, సంతోష్‌ను డీఎస్పీ అభినందించారు.

జీవితంపై విరక్తితో
యువకుడి ఆత్మహత్య

మల్లాపూర్, జూన్ 6: మండలంలోని రాఘవపేట గ్రామానికి చెందిన అలకుంట ప్రవీణ్(19) అనే యువకుడు జీవితంపై విరక్తి చెంది గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన అలకుంట ప్రవీణ్ ఆరు నెలల క్రితం గల్ఫ్ దేశం దుబాయికి వెళ్లి తిరిగి వచ్చాడు. అప్పటి నుంచి పనిలేక డబ్బులు లేక చేసిన అప్పులు తీర్చలేక తాగుడుకు బానిసయ్యాడు. దీంతో జీవితంపై విరక్తితో బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమో దు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పెండింగ్ బిల్లులు క్లియర్ చేయాలి

జగిత్యాల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల బిల్లులు క్లియర్ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘ నాయకులు విజ్ఞప్తి చేశారు. హైదరా బాద్‌లో గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకులు గాల్ రెడ్డి హర్షవర్ధన్‌రె డ్డితో పాటు జగిత్యాల జిల్లాకు చెందిన పలువురు పీఆర్‌టీయూ నాయకులు కలిశారు. బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు చెల్లించాలని, జీవో 317 బాధిత ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాల ని కోరారు. కార్యక్రమంలో జగిత్యాల జిల్లా అధ్యక్షుడు గాదె నర్సింగరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి నరుకుల్లా శ్రీధర్, నాయకులు రాజు జాదవ్ పాల్గొన్నారు.



ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

- నగదు, బంగారు ఆభరణాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఏసీపీ క్రిష్ణ

సుల్తానాబాద్, జూన్ 6: రెండు తెలుగు రాష్ట్రాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు పెద్దపల్లి ఏసీపీ గజ్జి క్రిష్ణ గురువారం అరెస్టు వివరాలను సుల్తానాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఖమ్మం జిల్లాకు చెందిన గుర్రం కోటేశ్వర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని బాపట్ల జిల్లా కర్లపాడెం మండల కేంద్రానికి చెందిన ఖాజా, ఖమ్మంకు చెందిన వాసు ముగ్గురు కలిసి కొంత కాలంగా దొంగతనాలకు పాల్పడుతూ పోలీసులకు మోస్ట్ వాంటెడ్ వ్యక్తులుగా మారారన్నారు. కోటేశ్వర్ గతంలో జైలుకు వెళ్లిన సందర్భంలో అక్కడ మిగతా ఇద్దరు కలిసి జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత మళ్లీ దొంగతనాలకు పాల్పడే వారని వివరించారు. తెలంగాణలోని ఓ గ్రామంలో దొంగతనం చేసి వెంటనే ఆంధ్ర ప్రదేశ్‌లో కానీ ఇతర జిల్లాల్లో గానీ తలదాచుకుంటారని, ఏపీలో ఒక చోరికి పాల్పడి ఆ వెంటనే జిల్లాలను మారుస్తారని, అవసరమైతే రాష్ట్రాలను కూడా మారుస్తారన్నారు. ఇందులో భాగంగా తెలంగాణలోని ఖమ్మంతో పాటు మంచిర్యాల జిల్లా, పెద్దపల్లి, కరీంనగర్, జగిత్యాల తదితర జిల్లాల్లో అనేక చోరీలకు పాల్పడ్డారని, తాజాగా సుల్తానాబాద్ సర్కిల్ పరిధి పొత్కపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక వైన్‌షాపులో దొంగతనానికి పాల్పడ్డారన్నారు. దాంతో పెద్దపల్లి పోలీసులు మూడు బృందాలుగా విడిపోయి ఈ దొంగల ఆచూకీ కోసం ప్రయత్నాలు చేశామన్నారు. రాష్ట్రంలోని అన్ని సీసీఎస్ పోలీస్‌స్టేషన్ల నుంచి వివరాలు సేకరించగా వీరు పాత నేరస్థులుగా తేలిందని, ఆ కోణంలో వారి కోసం వేట కొనసాగించగా ముగ్గురు దొంగలను పట్టుకున్నామని తెలిపారు. వారి నుంచి లక్షా డెబ్బై వేల నగదు, తొమ్మిదిన్నర లక్షల విలువ చేసే పదమూడు తులాల ఆరు గ్రాముల బంగారం, బైక్ స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ధర్మపురి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ పల్సర్ బైక్‌ను వీరు చోరీ చేశారన్నారు. దొంగలను పట్టుకోవడంలో కృషి చేసిన సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, కాల్వశ్రీరాంపూర్, పొత్కపల్లి, జూలపల్లి ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది తిరుపతి, రత్నాకర్, సుధాకర్, రమేష్, రాజు తదితరులను అభినందిస్తూ వారికి నగదు రివార్డులను అందజేశారు. ఈ సమావేశంలో సుల్తానాబాద్ ఎస్‌ఐ శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏసీపీ క్రిష్ణ

సౌదీలో వేంపల్లి వాసి ఆత్మహత్య

మల్లాపూర్, జూన్, 6: ఉపాధి కోసం గల్ఫ్ బాట పట్టిన జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలోని వేంపల్లి గ్రామానికి చెందిన కందెల వెంకటి(41) అనే వలస కార్మికుడు అప్పుల బాధతో సౌదీ అరేబియాలోని తన గదిలో గురువారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వేంపల్లి గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన కందెల వెంకటి చిన్నతనంలో తండ్రి రాజన్న మృతిచెందగా రేకుల షేడ్‌లో ఉంటూ తల్లి గంగరాజు కొద్ది పాటి భూమిలో వ్యవసాయం చేసు కుంటూ పిల్లలను పెంచి పెద్ద చేసింది. కుటుంబ పోషణ భారంగా మారడంతో పెద్దకుమారుడైన వెంకటి అప్పు చేసి ఇరువై ఏళ్ల నుంచి పలు గల్ఫ్ దేశాలకు వెళ్లి వస్తున్నాడు. కొంత కాలం క్రితం పెళ్లి చేసుకోగా ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. చేసిన అప్పులు తీర్చడానికి సౌదీ అరేబియాలోని ఓ షేక్ వద్ద గొర్లు మేపేందుకు జీతం కుదుర్చుకున్నాడు. వచ్చిన జీతం కుటుంబ పోషణకు, ఖర్చులకు సరిపోతుండడంతో చేసిన అప్పులు తీర్చలేననే బెంగతో కుమిలిపోతుండే వాడని బంధువులు, స్నేహితులు తెలిపారు. గురువారం పనులు ముగించుకుని తన రూమ్‌కు వచ్చిన తర్వాత ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంకటి మృతి చెందినట్లు స్నేహితులు ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతి వార్త విన్న కుటుంబీకులు తీవ్రంగా విలపించారు. వెంకటి మృతదేహాన్ని త్వరగా తెప్పించాలని, నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



వెంకటి(ఫైల్)

ట్రాక్టర్ ఢీకొని బాలుడి మృతి

ధర్మారం, జూన్ 6: మండలంలోని దొంగతుర్తి గ్రామంలో గురువారం ట్రాక్టర్ ప్రమాదంలో ఓ బాలుడు మృతిచెందాడు. గురువారం ఉదయం మ్యాన ప్రభాకర్ అనే వ్యక్తి తన ట్రాక్టర్‌ను వెనుకకు నడపడం వలన అతడి మనమడు మ్యాన వేదన్ష్(4) తీవ్ర గాయాలై మృతిచెందాడని ఎస్సై సత్యనారాయణ తెలిపారు. బాలుడి తండ్రి మ్యాన ఓంకార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతుకు గాయాలు

సైదాపూర్, జూన్ 6: సైదాపూర్ మండలంలోని లస్మన్నపల్లి గ్రామానికి చెందిన మొలుగూరి పోచయ్య అనే రైతుకు విద్యుత్ షాక్ తగిలి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పోచయ్య నారు మడికి నీరు పెట్టేందుకు తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. బావి వద్దకు కరంటు సరఫరా రాకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ వైర్లు సరి చేస్తుండగా షాక్‌కు గురై గాయపడ్డాడు. సమాచారం మేరకు కుటుంబసభ్యులు పోచయ్యను వెంటనే ఆస్పత్రికి తరలించారు.

వేగంగా సుందిళ్ల బ్యారేజీ మరమ్మతు పనులు

▸▸ నేడు పరిశీలించనున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మంథని/మంథనిరూరల్, జూన్ 6: కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని సుందిళ్ల బ్యారేజీ రిపేర్ పనులు వారం రోజులుగా వేగంగా కొనసాగుతున్నాయి. మండలంలోని సిరిపురం సమీపంలోని గోదావరినదిపై నిర్మించిన సుందిళ్ల బ్యారేజీ రిపేర్ పనులను పరిశీలించడానికి రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం మధ్యాహ్నం 1గంట ప్రాంతంలో వస్తున్నారు. బ్యారేజీ వద్ద జరుగుతున్న రిపేర్ పనులను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పరిశీలించిన అధికారులతో ఆరా తీయనున్నారు. అనంతరం భూపాలపల్లి జిల్లాలోని అన్నారం, మేడగడ్డ బ్యారేజీలను సందర్శించడానికి వెళ్లనున్నారు. సుందిళ్ల బ్యారేజీలో ఎన్‌డీఎస్‌ఏ సూచనల మేరకు బ్యారేజీ ఎగువ, దిగువన సీసీ బ్లాక్‌ల రిపేర్ పనులను నవయుగ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. బ్యారేజీ దిగువ ప్రాంతంలో సీసీ బ్లాక్‌లను రిపేర్‌తో సరిచేస్తున్నారు. ఎగువ ప్రాంతంలో 3, 4, 5 బ్లాక్స్‌లో సీసీ గ్రేడింగ్ పనులను చేపట్టడానికి అందులో ఉన్న నీటిని తీసివేయటానికి కావాల్సిన పనులను నిర్వహిస్తున్నారు. 2022లో వచ్చిన భారీ వరదల కారణంగా బ్యారేజీ ఎగువ ప్రాంతంలో కట్టకు ఒక వైపు గండి పడటంతో దాన్ని పూర్తిస్థాయిలో పూడ్చివేస్తున్నారు. ఈ పనులను మరో 20 రోజుల్లో పూర్తి చేస్తామని అధికారులు వెల్లడిస్తున్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో సుందిళ్ల బ్యారేజీ సమీపంలో హెలీప్యాడ్, ఇతర ఏర్పాట్లను అధికారులు చేశారు.



బ్యారేజీ దిగువ ప్రాంతంలో చేపడుతున్న సీసీ బ్లాక్ రిపేర్ పనులు

అనుమానాస్పదస్థితిలో ఒకరి మృతి

తిమ్మాపూర్, జూన్ 6: మండలంలోని మహాత్మానగర్ గ్రామంలో ఓ వ్యక్తి ఆటోలో అనుమానా స్పదంగా మృతి చెంది ఉన్నాడు. స్థానికులు, ఎల్ఎండీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గునుకుల వెంకటరమణ(66)అనే వ్యక్తి సింగరేణిలో పదవి విరమణ పొందిన అనంతరం కుటుంబం తో కలిసి మండలంలోని మహాత్మానగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కాగా బుధవారం రాత్రి ఎల్ఎండీ కాలనీలో గల గెస్ట్ హౌస్ సమీపంలో అతడు ఆటోలో పడి ఉన్నట్లు స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంకటరమణ కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకొని పరిశీలించగా మృతి చెంది ఉన్నాడు. తన భర్త మద్యం తాగి డీహైడ్రైషన్‌తో మరణించాడా, వేరే కారణలతో మృతి చెందాడా అని అనుమానం ఉందని వెంకటరమణ భార్య జయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చేరాలు తెలిపారు.

చోరీ కేసులో ఇద్దరికి ఏడాది జైలు శిక్ష

సిరిసిల్ల రూరల్, జూన్ 6: చోరీ కేసులో ఇద్దరు వ్యక్తులకు ఏడాది జైలు శిక్షతో పాటు100 రూపాయల చొప్పున జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి కావేటి సృజన గురువారం తీర్పునిచ్చినట్లు సిరిసిల్ల టౌన్ సీఐ రఘుపతి తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సర్దార్‌నగర్‌కు చెందిన బొట్ల వెంకటస్వామి అనే వ్యక్తికి రగుడు శివారులో ఉన్న భూమి చుట్టూ ప్రహరీ నిర్మించి దానికి గేటును అమర్చారన్నారు. ఆ గేటును 3-8-2023 రోజున దొంగతనం చేశారని పోలీస్ స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారని తెలిపారు. కేసు నమోదు చేసి దొంగతనం చేసిన పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన గూడూరి కిరణ్‌కుమార్, మెహెర్‌నగర్‌కు చెందిన షేక్ రియాజ్‌పాషాలను ఆరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. విచారణ అనంతరం విచారణ అధికారి ఎస్‌ఐ మల్లేశం కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారన్నారు. సీఎంఎస్ఎస్ఐ రవీందర్‌నాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ వేముల నరేష్ కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టారన్నారు. ప్రాసిక్యూషన్ తరపున చెలుమల సందీప్‌కుమార్ వాదించగా కేసు పూర్వపరాలను పరిశీలించిన న్యాయమూర్తి నేరస్థులైన గూడూరి కిరణ్‌కుమార్, షేక్ రియాజ్‌పాషాలకు ఏడాది శిక్షతో పాటు 100రూపాయల చొప్పున జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

శంకరపట్నం, జూన్ 6: అనారోగ్యంతో బాధపడుతూ పురుగుల మందు తాగిన శంకరపట్నం మండలం కన్నాపూర్ గ్రామానికి చెందిన ఓ యువకుడు చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతి చెందాడు. ఆడితం ఐలుకొమురు (24) రెండేళ్లుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఆస్పత్రుల్లో చూపించిన వ్యాధి నయం కాలేదు. ఈ నెల 2న నొప్పి తీవ్రం కావడంతో వ్యవసాయ బావి వద్ద పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఐలుకొమురును హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతి చెందాడు. ఐలుకొమురు తండ్రి రాజయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఐలుకొమురు(ఫైల్)

ఇటుక బట్టి వద్ద ప్రమాదంలో చిన్నారి మృతి

మేడిపల్లి, జూన్ 6: మేడిపల్లి మండల కేంద్రంలోని వీఎస్ఆర్ ఇటుక బట్టి వద్ద జరిగిన ప్రమాదంలో నిఖిల్ పోద్ (18నెలలు) చిన్నారి మృతి చెందాడు. ఒరిస్సా రాష్ట్రంలోని పదాన్‌పల్లి గ్రామానికి చెందిన దశరథ్ పోద్ అతని భార్య సారతి పోద్ కలిసి మేడిపల్లిలోని ఇటుక బట్టిలో పనులు చేస్తున్నారు. నిఖిల్ అమ్మమ్మ బసంతి తనను పక్కన కూర్చోబెట్టుకుని పని చేస్తుండగా ట్రాక్టర్ వెనకనుంచి చిన్నారి తలకు తాకింది. గమనించిన యజమాని ప్రసాద్ చికిత్స కోసం జగిత్యాల ఆసుపత్రికి తరలించాడు. పరీక్షించిన వైద్యులు నిఖిల్ మృతి చెందాడని తెలిపారు. మృతుడి తల్లి సారతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్యామ్‌రాజ్ తెలిపారు.

ఎస్‌యూ ఎల్‌ఎల్‌బీ పరీక్షల షెడ్యూల్ విడుదల

గణేశ్‌నగర్, జూన్6: శాతవాహన విశ్వ విద్యాలయం ఎల్‌ఎల్‌బీ నాలుగో, ఆరో సెమి స్టర్, ఎల్‌ఎల్‌ఎం 4వ సెమిస్టర్‌లకు సంబంధించిన తేదీలను యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామి నేషన్ డాక్టర్ శ్రీరంగప్రసాద్ విడుదల చేశారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని ఆయన పేర్కొన్నారు.

ఉరివేసుకొని విద్యార్థి ఆత్మహత్య


రిషికేష్ (ఫైల్)

వేములవాడ టౌన్, జూన్ 6: వేములవాడ పట్టణంలో చదువుకోమ్మని మందలించినందుకు రిషికేష్ (18) అనే విద్యార్థి ఉరివేసుకొని గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. వేములవాడ పట్టణంలో శాస్త్రినగర్‌కు చెందిన రిషికేష్ (18) ఇటీవల ఇంటర్ పూర్తి చేశాడు. ఇంజనీరింగ్‌కు రాజస్థాన్‌లోని ఓ కాలేజీలో సీఎస్ఈలో సీటు రావడంవతో అవసరమైన ఏర్పాట్లను తల్లిదండ్రులు పూర్తి చేశారు. దీంతో అక్కడికి వెళ్లేది లేదని గొడవపడిన రిషికేష్ గురువారం సాయంత్రం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు రిషికేష్ తండ్రి రాజలింగం ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


సందీప్ (ఫైల్)

కోనరావుపేట, జూన్ 6: వ్యవసాయ పొలం వద్ద ఉన్న పశువుల పాక వద్ద విద్యుత్ వైర్లు సరి చేస్తున్న సమయంలో విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందిన సంఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మర్తనపేట గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన ముంద్రాయి విజయ్‌కుమార్, విజయ దంపతుల పెద్ద కుమారుడు ముంద్రాయి సందీప్ (38) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబంతో కలిసి జీవిస్తున్నాడు. గురువారం ఉదయం పశువుల పాకకు విద్యుత్ కనెక్షన్ వైరును సోదరుడు సాయికుమార్‌తో కలిసి మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే గమనించిన సోదరుడు సందీప్‌ను సిరిసిల్ల ఏరియా హాస్పిటల్ కు తరలించాడు. వైద్యులు చికిత్స అందిస్తుండగానే మృతి చెందాడు. సందీప్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య రమ్య, కుమారులు అశ్వంత్ కుమార్, హర్షవర్ధన్ ఉన్నారు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు, నాయకులు కోరారు.

పంట చేనులో మహిళ కూలీ మృతి

వేములవాడ టౌన్, జూన్ 6: పట్టణ శివారులోని వ్యవసాయ పొలంలో పనిచేస్తూ మహిళారైతు కుప్ప కూలీ గురువారం మృతి చెందింది. పట్టణంలోని భగవంతరావునగర్‌కు చెందిన గడ్డం అమృతవ్వ (65) పట్టణ శివారులోని జయవరం రోడ్డులో పత్తి విత్తనాలు నాటేందుకు వెళ్లింది. కూలీ పనిచేస్తుండగా శ్వాస ఆడడం లేదంటూ ఇబ్బంది పడుతూ అక్కడున్న తోటి వారికి సమాచారం ఇచ్చింది. దీంతో వారు 108కు సమాచారం అందించగా వెంటనే ఆమెను ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతి చెందినట్లుగా బంధువులు తెలిపారు. మృతురాలికి భర్త లక్ష్మారెడ్డి ఉన్నారు.

బెదిరింపులకు పాల్పడిన ఘటనలో ఒకరి అరెస్ట్

చందుర్తి, జూన్ 6: చందుర్తి మండలం లింగంపేట గ్రామంలో గత నెల 23న ఓ రైతు భూమి చదును చేయిస్తుండగా డబ్బులు ఇవ్వాలని బెదిరింపులకు పాల్పడిన సంఘటనలో మరొకరిని అరెస్టు చేసినట్టు చందుర్తి ఎస్సై శ్రీకాంత్ గురువారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం లక్ష్మీరాజం అనే రైతును బెదిరించి, 40 వేల రూపాయలు ఇవ్వాలని బెదిరించిన సంఘటనలో లింగంపేట గ్రామానికి చెందిన ఓ టీవీ ఛానల్ రిపోర్టర్ గుంటి గణేష్ అనే నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. ఈ సంఘటనలో మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

కిడ్నాప్ కేసులో నలుగురు వ్యక్తుల రిమాండ్

వేములవాడ రూరల్, జూన్ 6: కిడ్నాప్ కేసులో నలుగురు వ్యక్తులను రిమండ్‌కు తరలించినట్లు రూరల్ ఎస్సై మారుతి తెలిపారు. గురువారం సాయంత్రం రూరల్ పోలీస్‌స్టేషన్లో ఆయన వివరాలు వెల్లడించారు. అనుపురం గ్రామానికి చెందిన చింతకుంట ప్రవీణ్ భార్య కళ్యాణి వట్టెంలలోని తన తల్లిగారి ఇంటికి వెళ్లింది. మంగళవారం తన అత్తగారి ఇంటికి వెళ్లగా అక్కడ తన భార్యలేదని ఫాజుల్‌నగర్ గ్రామంలోని బంధువైన గండి రాజు ఇంటికి వెళ్లాడు. గండి రాజు, ఆకుల రాకేష్, కనకట్ల శ్రీనివాస్, మద్దివేణు, సాయికుమార్ అనే నలుగురు వ్యక్తులు కలిసి ప్రవీణ్‌ను కిడ్నాప్ చేసి చితకబాదారని ప్రవీణ్ తండ్రి కిషన్ రూరల్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నలుగురువ్యక్తులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై మారుతి తెలిపారు.

భూకబ్జాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు

వేములవాడ టౌన్, జూన్ 6: భూ కబ్జాలు చేస్తూ అక్రమ లేఔట్లను సృష్టించి అమ్మడం, అనుమతి లేకుండా ప్లాట్స్ చేసి అమ్మడం వంటి మోసాలకు పాల్పడుతున్న సిరిగిరి రమేష్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వేములవాడ మండలం చంద్రగిరి గ్రామ పరిధిలోని తెట్టేకుంటకి చెందిన చెన్నమనేని వెంకటేశ్వరుల దగ్గర సిరిసిల్ల పట్టణానికి చెందిన సిరిగిరి రమేష్ అనే వ్యక్తి సుమారుగా రెండు ఎకరాల భూమిని కొనుగోలు చేశాడు. వెంకటేశ్వర్లు వృద్ధాప్యాన్ని అసరాగా చేసుకుని అసలు ఉనికిలో లేని పాట్లను సృష్టించడమే కాకుండా పక్కనే వున్న చెన్నమనేని జగన్మోహన్ భూమిలోకి అక్రమంగా చొరబడ్డాడు. రికార్డుల్లో రోడ్డుగా వున్న భూమిని లేఔట్ చేసి అమ్మడం, పర్మిషన్ లేకుండా ప్లాట్స్ గా మలిచి అమాయక ప్రజలకు అమ్మి మోసపూరితముగా రిజిస్ట్రేషన్ చేస్తున్నాడనే పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి ఈ రోజు రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే లక్ష్యం

ఎల్లారెడ్డిపేట, జూన్ 6: నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే తమ లక్ష్యమని 'సెస్' చైర్మన్ చిక్కాల రామారావు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్ గ్రామంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌ను గురువారం ఆయన పరిశీలించారు. ఇటీవల ఏర్పాటు చేసిన 11కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ చిక్కాల రామారావు మాట్లాడుతూ గ్రామాల్లో విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని అన్నారు. వ్యవసాయ పొలాల్లో వాలిన విద్యుత్ స్తంభాలను సరిచేయడంతో పాటు కిందకు వేలాడుతున్న తీగలను బిగించేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సకాలంలో వినియోగదారులు విద్యుత్ బిల్లులు చెల్లించి సంస్థ మనుగడకు పాటుపడాలని చైర్మన్ చిక్కాల రామారావు కోరారు. ఆయన వెంట జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, ఎంపీటీసీ బాబు, 'సెస్' ఏడీ మహేందర్ తదితరులు ఉన్నారు.

అంతర్జాతీయ పోటీల్లో బండపల్లి వాసికి గోల్డ్ మెడల్


అంతర్జాతీయ అథ్లెటిక్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిన కైలాసం

చందుర్తి, జూన్ 6: చందుర్తి మండలం బండపల్లి గ్రామానికి చెందిన గంప కైలాసం (85) అనే వృద్ధుడు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని అయోధ్యలో ఈ నెల 5వ నుంచి జరుగుతున్న అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ పోటీల్లో రెండు గోల్డ్ మెడల్ లు సాధించినట్లు గ్రామస్థులు తెలిపారు. 400 మీటర్ల రన్నింగ్ పోటీల్లో, 5 కిలోమీటర్ల వాకింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకాలు సాధించినట్లు తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా మాస్టర్ అథ్లెటిక్స్ క్రీడల జాయింట్ సెక్రెటరీ చింతలపల్లి మునీందర్ రెడ్డి, పెద్దపల్లి జిల్లా టీమ్ మేనేజర్ కళ్లెం మహేందర్ రెడ్డి సహకారంతో పోటీలో పాల్గొని గోల్డ్ మెడల్ సాధించడంపై బండపల్లి గ్రామస్థులు గంప కైలాసంను అభినందించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

- పిల్లలను పాఠశాలలో చేర్పించండి- బడి బాటలో భాగంగా ఇంటింటికి తిరిగిన ఉపాధ్యాయులు


ఎల్లారెడ్డిపేటలో బడి బాట ర్యాలీ తీస్తున్న ఉపాధ్యాయులు


సిరిసిల్ల బీవైనగర్‌లో బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు


గంభీరావుపేట మండలం లింగన్నపేటలో..

సిరిసిల్ల రూరల్, జూన్ 6: ప్రభుత్వ పాఠశాలల్లో అందించే ఉత్తమ విద్యను అభ్యసించడానికి పిల్లలను చేర్పించాలంటూ ఉపాధ్యాయులు ఇంటింటికి తిరుగుతూ తల్లిదండ్రులకు అవగాహన కల్పించడంతో పాటు పేర్లు నమోదు చేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బడిబాట కార్యక్రమంలో భాగంగా సిరిసిల్ల పట్టణంలోని శివనగర్ కుసుమ రామయ్య బాలుర ఉన్నత పాఠశాలతో పాటు నెహ్రూనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గీతానగర్ బాలికల ఉన్నత పాఠశాల, అంబేద్కర్ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఆ పాఠశాల పరిధిలోని బీవైనగర్, గణేష్‌నగర్, నెహ్రూనగర్, గీతానగర్, విద్యానగర్, సుభాస్‌నగర్, కొత్త బస్టాండ్, గోపాల్‌నగర్ ప్రాంతాల్లో ఉండే ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఇళ్లకు వెళ్లి పిల్లలను ప్రభుత్వం సకల సౌకర్యాలతో విద్యను అందిస్తుందని పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలంటూ అవగాహన కల్పించడంతో పాటు పిల్లల పేర్లను నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మోతీలాల్, నాగుల భాగ్యరేఖ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంతో పాటు గొల్లపల్లి, వెంకటాపూర్, పదిర, హరిదాస్‌నగర్, నారాయణపూర్, దుమాల, అక్కపల్లి, గుండారం, తిమ్మాపూర్, బండలింగంపల్లి, బొప్పాపూర్, అల్మాస్‌పూర్ తదితర గ్రామాల్లో 'ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఉపాధ్యాయులు ఇంటింటా తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని కోరారు. ప్రభుత్వ బడుల్లోని వసతులు, విద్య, తదితర అంశాలపై తల్లిదండ్రులను అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండలంలోని లింగన్నపేటలో బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. నోడల్ అధికారి గంగారాం ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. లింగన్నపేట గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉచిత పాఠ్య పుస్తకాలు, ఉచిత దుస్తుల, మధ్యాహ్న భోజనంతో పాటు నాణ్యమైన విద్య అందుతుందని తల్లితండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి. విద్యర్థుల ఉజ్వల భవిష్యత్‌కు తోడ్పడాలని నోడల్ అధికారి గంగారాం కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ముస్తాబాద్ మండల నోడల్ అధికారి రాజిరెడ్డి పేర్కొన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో బడిబాట కార్యక్రమాన్ని ఇంటింటా చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, ఉచిత విద్య, ఉచిత పుస్తకాలు, యునిఫాంలతో పాటు మధ్యాహ్న భోజనం అందుబాటులో ఉంటుందని తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రభాకర్‌రెడ్డి, పద్మకల, బుచ్చిరెడ్డి, రవీందర్, యాదగిరి, శ్రీనివాస్‌గౌడ్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు కొనసాగుతున్నాయని ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్‌రావు అన్నారు. కోనరావుపేట మండలం మంగళపల్లి గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్యను అందిస్తున్నామని అన్నారు. ప్రభుత్వ పాఠశా లలో అన్నిరకాల మౌలిక వసతులు ప్రభుత్వం కల్పించిందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలోనే చదివిన విద్యార్థులు అత్యధిక మార్కులు సాధిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యా యులు శ్రీకాంత్, లావణ్య తదితరులు ఉన్నారు.

పిడుగుపాటుకు గొర్రెల కాపరికి తీవ్రగాయాలు

- ఉరుములు, మెరుపులతో కూడిన గాలివాన - నేలకూలిన చెట్లు- ఎగిరిపోయిన రేకులు


ఎల్లారెడ్డిపేటలో కారుపై పడిన రేకులు


ఎల్లారెడ్డిపేటలో గాలివానకు నేలకూలిన చెట్టు

ఎల్లారెడ్డిపేట, జూన్ 6: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు నారాయణపూర్, బొప్పాపూర్, గొల్లపల్లి, పదిర, హరిదాస్‌నగర్, దుమాల, అక్కపల్లి, తదితర గ్రామాల్లో గురువారం ఉరుములు, మెరుపులతో కూడిన గాలి వాన కురిసింది. పిడుగుపాటుకు మండలంలోని తిమ్మాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని బాకురుపల్లికి చెందిన గొర్రెల కాపరి అమరగొండ ఎల్లయ్య తీవ్ర గాయాలపాలయ్యాడు. తోటి గొర్రెల కాపారులు 108 వాహనానికి సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఎల్లయ్యతో పాటు మల్లయ్య మరో ఇద్దరు కలిసి తమ గొర్రెలను మేత కోసం సమీప అటవీప్రాంతానికి తీసుకెళ్లారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి ఎల్లయ్య ఓ చెట్టు కింద నిలబడ్డాడు. మల్లయ్య, మరో ఇద్దరు వేరే చెట్టు వద్ద తలదాచుకున్నారు. పిడుగు పడడంతో ఎల్లయ్య తీవ్ర గాయాలపాలయ్యాడు. భారీ గాలి దుమారానికి ఆయా గ్రామాల్లోని చెట్లు నేల కూలాయి. మండల కేంద్రంలో కారు కోసం వేసిన రేకులు గాలికి వాహనంపై పడిపోయాయి. పలు గ్రామాల్లోని పశువుల పాకలు, ఇంటి పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. కురిసిన వర్షానికి వరద నీరు రహదారులపై నిలిచింది.

రుద్రంగి: రుద్రంగి మండల కేంద్రంలో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడింది. మధ్యాహ్నం వరకు ఎండతీవ్రతతో జనాలు అల్లాడిపోయారు. ఒక్కసారిగా వాతావరణం మారిపోయి వర్షం పడడంతో చల్లబడింది. ఈదురు గాలుల ప్రభావంతో వర్షానికి విద్యుత్ అంతరాయం ఏర్పడింది. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తడిసిపోయింది.

● **పిడుగుపాటుకు ఆవులు మృతి..**

వేములవాడ రూరల్: మండలంలో గురువారం ఉరుములు, మెరుపులతో కూడిన చినుకులు కురిసాయి. అచ్చన్నపల్లి గ్రామంలో పిడుగుపాటుకు కల్లూరి లచ్చయ్యకు చెందిన రెండు ఆవులు మృతి చెందాయి. దాదాపు రెండు లక్షల నష్టం వాటిల్లిందని ప్రభుత్వం ఆదుకోవాలని సదరు రైతు కోరాడు.


అచ్చన్నపల్లిలో మృతి చెందిన ఆవులు

సెట్ బ్యాక్ లేకుండా గ్రామపంచాయతీ నిర్మాణంపై ఫిర్యాదు

ముస్తాబాద్, జూన్ 6: మండలంలోని పోతుగల్ గ్రామపంచాయతీ నూతన భవనం సెట్ బ్యాక్ లేకుండా నిర్మిస్తున్నారని ఎస్ఆర్ఐసెల్ జిల్లా అధ్యక్షుడు తోట ధర్మేందర్ ఆరోపించారు. ముస్తాబాద్‌లో గురువారం మాట్లాడుతూ పోత్గల్ గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి ఇప్పటికే రూ 30 లక్షలు మంజూరయ్యాయన్నారు. నూతన భవన నిర్మాణం ఎలాంటి సెట్ బ్యాక్ లేకుండా నిర్మించారని గుత్తేదారులను ప్రశ్నిస్తే తోసిపుచ్చే సమాధానం చెపుతున్నారని పేర్కొన్నారు. మధ్యలోనే ఆగిన గ్రామ పంచాయతీ భవనం నిర్మాణ నిధులు విడుదల కాకుండా ఆపాలని, అలాగే నూతన గ్రామపంచాయతీ సెట్ బ్యాక్‌తో నిర్మించాలని జిల్లా పంచాయతీ అధికారికి తోట ధర్మేందర్ ఫిర్యాదు చేశారు.

యువత ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి

వేములవాడ టౌన్, జూన్ 6: యువత ఒక లక్ష్యాన్ని ఏర్పరుచుకుని ఆ లక్ష్యాన్ని సాధించే దిశగా ముందుకు సాగాలని బీఆర్ఎస్ సీనియర్ నేత, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి అన్నారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లి గ్రామానికి చెందిన అడ్వకేట్ గుడిసే సదానందం కుమారుడు జెమ్స్ ఎంబీబీఎస్ సీట్ సాధించన సందర్భంగా యువకున్ని సన్మానించి, అభినందించారు. ఈ సందర్భంగా మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ నేటి యువత సోసల్ మీడియాకు అట్రాక్ట్ అయిత తమ విలువైన సమయాన్ని కోల్పోతున్నారని అన్నారు. సోసల్ మీడియాను విద్యార్థులు తమకు ఉపయోగకరంగా వుండే అంశాలకు వినియోగించుకోవాలని అన్నారు. తల్లిదండ్రుల మీద ఆధారపడకుండా జెమ్స్ తన తెలివితో ఎంబీబీఎస్ సీట్ సాధించడం చాలా గొప్పవిషయమని కొనియాడారు. ఆయన వెంట మ్యాకల శ్రీనివాస్, పర్శరాములు, మనోజ్, అనిల్, వెంకటేశ్, సంతోష్‌రెడ్డి, మునిందర్, మహేష్, పురుషోత్తం, సాయికుమార్, వీరేందర్, మహేందర్ తదితరులు ఉన్నారు.

అన్నదాతకు ఆరుద్ర కొండంత ధైర్యం


ఓ రైతు పొలంలో కన్పించిన ఆరుద్ర పురుగు

గంభీరావుపేట, జూన్ 6: ఆరుద్ర పురుగు కనిపిస్తే వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని అన్నదాతలకు అపార నమ్మకం. ఆరుద్ర పురుగు అంటేనే వర్షాలకు నిలయంగా చెప్పుకుంటారు. గంభీరావుపేట మండల కేంద్రంలోని మల్యాల రాజవీర్ అనే రైతు పొలంలో గురువారం ఆరుద్ర పురుగు కన్పించింది. ఆరుద్ర పురుగు అగుపించడంతో ఆ రైతు ఆనందానికి అవదులు లేకుండా పోయింది. ఇక ఈ సారి వర్షాలకు ఢోకా లేదంటూ గంగమ్మ తల్లికి పూజలు చేశాడు.

అంజన్న ముడుపుల ఆదాయం లెక్కింపు

మల్యాల, జూన్ 6: కొండగట్టు అంజనేయస్వామి ఆలయంలో ఇటీవల జరిగిన పెద్ద హనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా భక్తులు చెల్లించుకున్న ముడుపులను గురువారం దేవస్థానం అధికారులు లెక్కింపు చేపట్టారు. కొబ్బరికాయలు, బియ్యం, డబ్బులను వేర్వేరు చేసి లెక్కింపు చేయగా రూ.2,89,810 నగదు సమకూరినట్లు ఈవో చంద్రశేఖర్ తెలిపారు. నగదుతో పాటు వచ్చిన ముడుపులు కొబ్బరికాయలు, బియ్యంను వేలం ద్వారా విక్రయించనున్నట్లు ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు తెలిపారు. లెక్కింపులో ఏఈవో వై అంజయ్య, పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ, సునీల్‌కుమార్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురిలో శని జయంతి వేడుకలు

ధర్మపురి, జూన్ 6: ధర్మపురి క్షేత్రంలో శని జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్ కుమార్‌శర్మ శని దేవుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనేక మంది భక్తులు శని దేవుడికి తైలం పోసి భక్తి శ్రద్ధలతో పూజించి దర్శనం చేసుకున్నారు.

జీవన్‌రెడ్డిని కలిసి ప్రభుత్వ విప్ ఆది


ఎమ్మెల్సీతో మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, జూన్ 6: జగిత్యాల పట్టణంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా నిజామాబాద్ ఎంపీ అభ్యర్థిగా పోటీచేసిన జీవన్‌రెడ్డి ఓటమి చవిచూడటంతో ఆయనను మర్యాపూర్వదంగా వెళ్లి కలిశారు.

రాజన్నను దర్శించుకున్న మంజు శర్మ


రాజన్న చిత్రపటాన్ని అందజేస్తున్న సిరిగిరి శ్రీరాములు

వేములవాడ టౌన్, జూన్ 6: వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారిని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ జనరల్ మేనేజర్ మంజుశర్మ గురువారం దర్శించుకున్నారు. రాజన్న ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వదించగా సూపరింటెండెంట్ సిరిగిరి శ్రీరాములు, కాంచనపల్లి నటరాజు స్వామి వారి ప్రసాదాన్ని అందించారు.

క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి: జడ్పీటీసీ


మర్రిగడ్డలో బహుమతులు ప్రదానం చేస్తున్న నాయకులు

చందుర్తి, జూన్ 6: క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని జడ్పీటీసీ నాగం కుమార్ అన్నారు. చందుర్తి మండలం మర్రిగడ్డలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సంతపురి బాలు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆది శ్రీనన్న వాలీబాల్ టోర్నమెంట్ గురువారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులు క్రీడల్లో రాణించి మండల, జిల్లా, రాష్ట్రస్థాయిల్లో గుర్తింపు పొందాలన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసంతో పెంపొందుతుందన్నారు. అనంతరం గెలుపొందిన మల్యాల జట్టుకు ప్రథమ బహుమతిగా ఐదు వేల రూపాయలు ప్రైజ్ మనీ, కప్‌ను, రన్నరప్‌గా నిలిచిన మర్రిగడ్డ జట్టుకు 2500 రూపాయల ప్రైజ్ మనీ కప్‌ను అందజేశారు. కార్యక్రమంలో జోగాపూర్ ఎంపీటీసీ మ్యాకల గణేష్, నాయకులు పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం


కొనాయపల్లిలో కేక్‌కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

వేములవాడ టౌన్, జూన్ 6: ఆంధ్రప్రదేశ్‌లో అతత్యధిక మెజార్టీతో గెలుపొందిన తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం రాబోతుందని టీడీపీ మండల అధ్యక్షుడు చింతలకోటి రామస్వామి అన్నారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని కొనాయపల్లిలో గురువారం సంబరాలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ఆర్‌సీపీ అరాచకాలను ప్రజలు తట్టుకోలేకపోయారని, తెలుగుదేశం పార్టీ అధినేత ఆధ్వర్యంలో ఏర్పాటైన కూటమికి ప్రజలు జైకొట్టి భారీ మెజార్టీతో గెలిపించారని అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో టీడీపీకి పూర్వవైభవం రానుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దేవయ్య, సత్తురేవారెడ్డి, అంజయ్య, లక్ష్మి, సుదాకర్, సతీష్, శ్యామ్, పవన్, హరీష్ ఉన్నారు.

ఉపాధి హామీ కూలీల ఆందోళన


ఆందోళన చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

చందుర్తి, జూన్ 6: ఫోన్ నెట్‌వర్క్ ఇబ్బందులతో ఉపాధిహామీ కూలీల హాజరు నమోదు మస్టర్లు డౌన్లోడ్ కాకపోవడంతో ఉపాధి హామీ కూలీలు ఆందోళన చేసిన సంఘటన చందుర్తి మండలం కట్టలింగంపేట గ్రామంలో జరిగింది. మండలంలోని కట్టలింగంపేట గ్రామ శివారులోని గుట్ట ప్రాంతంలో గురువారం కందకాల తవ్వే పనులు ప్రారంభించారు. దాదాపు 40 మంది కూలీలు ఉదయం ఏడు గంటలకు పనులకు హాజరయ్యారు. ఫోన్ నెట్‌వర్క్ ఇబ్బందులు ఏర్పడడంతో కూలీల హాజరు నమోదులో ఆలస్యం జరిగింది. దీంతో కూలీలు హాజరు నమోదు కాకుంటే ఒకరోజు కూలి నష్టపోతామని ఆందోళన చేపట్టారు. ఫీల్డ్ అసిస్టెంట్ నాగలక్ష్మి మండల పరిషత్‌లోని ఉపాధి హామీ కార్యాలయం చేరుకొని మస్టర్లు డౌన్లోడ్ చేసుకుని తిరిగి కట్టలింగంపేట గ్రామంలోని పనులు చేసే ప్రాంతానికి కూలీలతో వెళ్లి హాజరు నమోదు చేసినట్లు ఏపీవో రాజయ్య తెలిపారు.